ప్రజాశక్తి
మంగళవారం 14 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి

ముళ్ల చెట్లతో నిండిపోయిన పెడబల్లి ప్రధాన కాలువ

అడవి కాదు కాలువ..!

కంపచెట్లతో మూసుకుపోయిన పెడబల్లి ప్రధాన కాలువ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సాగునీటిని అందించాల్సిన ప్రధాన కాలువ అధికారుల నిర్లక్ష్యంతో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. మొత్తం చెట్లతో నిండిపోయ అక్కడ ఓ కాలువ ఉందన్న విషయం కూడా తెలియకుండా ఉంది. నంబులపూలకుంట మండల పరిధిలోని పెడబల్లి గ్రామపంచాయతీ పెడబల్లి ప్రాజెక్టు కింద ప్రధాన కాలువ దాదాపు 12 కిలోమీటర్లు ఉంది. సాగునీటి సరఫరా నిమిత్తం ఈ కాలువను 2008 సంవత్సరంలో పూర్తి చేశారు. దీని కింద పెడపల్లి, గొల్లపల్లి, తండా, బత్తినగారిపల్లితో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రధాన కాలువ ద్వారా దాని కింద ఉన్న వేలాది ఎకరాలకు నీరిచ్చి సాగులోకి తేవాలన్న ఉద్దేశంతో దీనిని నిర్మించారు. కొన్నేళ్ల క్రితం ప్రధాన కాలువ పెడబల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని పంటల సాగు నిమిత్తం అందించారు. అప్పట్లో సంవత్సరానికి మూడు పంటలను రైతులు పండించారు. రానురానూ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఈ కాలువ కంపచెట్లతో మూసుకుపోయింది. ప్రస్తుతం గొల్లపల్లి, బత్తినిగారిపల్లి గ్రామాల పరిధిలో కాలువ మొత్తం కంపచెట్లతో నిండిపోయింది. ఈ చెట్లతో కాలువ అడవిని తలపిస్తోంది. పెద్దపెద్ద రాళ్లు కాలువ నిండా చేరాయి. రైతుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలతో నిర్మించిన కాలువ పరిరక్షణపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కాలువ ఏర్పాటు సమయంలో వందలాది ఎకరాల సాగు భూమిని రైతులు కోల్పోయారు. కాలువ ఏర్పాటు అయితే భూములు సాగులోకి వస్తాయన్న ఉద్దేశంతో రైతులు అతి తక్కువ నష్టపరిహారం తీసుకుని వారి భూములను ఇచ్చేశారు. తీరా కాలువ పూర్తయ్యాక సాగు నీరు సరఫరా చేయకపోగా, అందులో కంపచెట్లు పెరిగి వృథాగా మారింది. దీంతో రైతులు చేసిన త్యాగం వృథా అయ్యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నంబులపూలకుంట పరిధిలోని పెడబల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువలోని మొక్కలను తొలగించి, దాని ద్వారా సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

రామంజులనాయక్, ఇరిగేషన్ ఎఇ.

పెడబల్లి ప్రాజెక్టు కింద ప్రధాన కాలువలో కంపచెట్లు పెరిగాయి. త్వరలో కాలవను పరిశీలించి మరమ్మతు చర్యలు చేపడతాం. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. పంటల పండించడానికి సాగునీరు అవసరమని రైతులు కోరితే తప్పనిసరిగా సాగునీటిని ఈ కాలువ ద్వారా అందిస్తాం.

కాలువ కూడా కన్పించకుండా పెరిగిన చెట్లు

పైపైకి పాతాళగంగ..!

◆ 20 ఏళ్లలో ఇదే రికార్డు ◆ వర్షపాతం ద్వారా 233.53 టిఎంసిల నీరు ◆ ఒడిసిపట్టింది 28.02 టిఎంసిలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం క్షామ ప్రాంతంగా ఉండే అనంతపురం జిల్లాలో వర్షాభావంతో భూగర్భ జలాలు ఎప్పుడూ పాతాళంలోనే ఉండేది. దీని కోసం రైతులు వెయ్యి అడుగుల వరకు బోర్లు వేసినా ప్రయోజనముండేది కాదు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల్లో ఏమోగానీ గడిచిన మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు పైకొచ్చాయి. 20 ఏళ్లలో ఎన్నడూలేనంత పైకి ఈసారి వచ్చాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున 5.81 మీటర్ల ఎత్తులో భూగర్భ జలాలు ఉన్నట్లు భూగర్భ జల శాఖ నివేదికలు చెబుతున్నాయి. 2022 నవంబర్ అయితే 4.94 మీటర్ల ఎత్తులోనే నీరు ఉండింది. ఇప్పుడు అవి 5.81 మీటర్ల లోతుకు చేరింది. అంతకు మునుపు సంవత్సరం కంటే చూస్తే ఈసారి 3.37 మీటర్ల నీటి మట్టం పెరిగింది.

20 సంవత్సరాల్లో ఇప్పుడు అత్యధికం

2000 సంవత్సరం నుంచి రాష్ట్రంలో భూగర్భ జలాల నీటి మట్టాన్ని పిజియో మీటర్ల ద్వారా కొలుస్తున్నారు. అంతకు మునుపు దిగుడు బావుల్లో నీటి మట్టాలను కొలిచి లెక్క గట్టేవారు. 2000 సంవత్సరం నుంచి పిజియో మీటర్ల ద్వారా బోరు బావుల్లోకి పరికరాలను పంపి నీటిని సాంకేతిక పద్ధతలో లెక్క గట్టడం ప్రారంభమైంది. అప్పటి నుంచి చూస్తే ఉమ్మడి జిల్లాలో మొత్తం 190 ప్రాంతాల్లో లెక్కిస్తున్నారు. ప్రత్యేకంగా అనంతపురం జిల్లాలో అయితే 97 ప్రాంతాల్లో లెక్కిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి చూసినప్పుడు సగటున ఏటా 11 మీటర్ల నుంచి 22 మీటర్ల లోతున బోరుబావుల్లో నీరు లభించేవి. గడిచిన రెండేళ్లుగా అధిక వర్షాలతో నీరు పైకి రావడంతో భూగర్భ జలాలు ఐదు మీటర్లకు చేరువగా వచ్చాయి. 2019 ఫిబ్రవరిలో అయితే 23.39 మీటరర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. తక్కువ భూగర్భ జలాలున్న సంవత్సరం 20 సంవత్సరాల్లో ఇదే కావడం గమనార్హం.

20 సంవత్సరాల్లో ఫిబ్రవరి మాసంలోనున్న భూగర్భ జల మట్టాలు

సంవత్సరం	నెల	భూగర్భ జలమట్టం (మీటర్లలో)
2001	ఫిబ్రవరి	10.82
2002	ఫిబ్రవరి	8.13
2003	ఫిబ్రవరి	13.97
2004	ఫిబ్రవరి	16.81
2005	ఫిబ్రవరి	19.43
2006	ఫిబ్రవరి	12.88
2007	ఫిబ్రవరి	16.72
2008	పిబ్రవరి	12.56
2009	ఫిబ్రవరి	11.47
2010	ఫిబ్రవరి	12.55
2011	ఫిబ్రవరి	11.33
2012	ఫిబ్రవరి	15.01
2013	ఫిబ్రవరి	17.42
2014	ఫిబ్రవరి	16.76
2015	ఫిబ్రవరి	21.78
2016	ఫిబ్రవరి	15.89
2017	ఫిబ్రవరి	23.91
2018	ఫిబ్రవరి	17.28
2019	ఫిబ్రవరి	23.39
2020	ఫిబ్రవరి	18.84
2021	ఫిబ్రవరి	11.23
2022	ఫిబ్రవరి	7.63
2023	ఫిబ్రవరి	5.81

ఈ ఏడాది వర్షాలకు వచ్చిన నీరు 233.53 టిఎంసిలు

జిల్లాలో ఈఏడాది అధిక వర్షాలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురం జిల్లాలో 648 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. ఇది సాధారణం కంటే 40 శాతం అధికం. గతేడాది ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది పడిన మొత్తం వర్షాన్ని లెక్కగడితే 233.53 టిఎంసిల నీరు లభించినట్టయిందని భూగర్భ జల శాఖలెక్క గట్టింది. ఇందులో 28.02 టిఎంసిల నీటిని వివిధ స్ట్రక్చర్లలో ఒడిసి పట్టుకోగలిగినట్టు సమాచారం. అంటే 12 శాతం వరకు మాత్రమే నీటిని ఒడిసి పట్ట గలిగారు. తక్కిన నీరు బయటకెళ్లిపోయింది. మొత్తంగా ఈ ఏడాది వర్షాలతో గతంలో ఎన్నడూలేనంతగా భూగర్భ జలాలు పైకి రావడం హర్షణీయం.

చిట్టి చేతులు.. మేటి ప్రయోగాలు..!

విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

◆ ఆకట్టుకున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సు
◆ పాల్గొన్న వందలాది మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
◆ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వారి మేధస్సుకు పదును పెట్టారు. చిట్టి చేతులు... మేటి ప్రయోగాలను చేసి అందరి చేత ఔరా అనిపించారు. వందలాది మంది విద్యార్థులు ఒక చోట చేరి నమూనాల రూపంలో వారిలోని తెలివితేటలను బయట పెట్టారు. పుట్టపర్తిలోని జగరాజుపల్లి మంగళకర కళాశాలలో సోమవారం నిర్వహించిన శ్రీ సత్యసాయి జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2022-23లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అబ్బురపరిచేలా వివిధ నమూనాలను తయారు చేశారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రాజెక్టులను తయారు చేసి వారిలోని ప్రతిభను చాటారు. ఇందులో ఐదు అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులకు అందజేశారు. కలెక్టర్ బసంత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. వాటి గురించి ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. నమూనాలు తయారు చేసిన ప్రతి విద్యార్థినినీ అభినందించారు. విద్యార్థి దశలోనే శాస్త్ర, సాంకేతిక రంగాలపై మక్కువ పెంచుకుని వాటికి సంబంధించిన ప్రయోగాలను చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. చిలమత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.సంపత్ కుమార్ ప్లాస్టిక్ పదార్థాలను ఉపయోగించి మొక్కలకు ఎరువులు వేసే పరికరం, రాత్రిపూట రైతులు పొలాల దగ్గరికి వెళ్లేప్పుడు పాముల బారిన పడకుండా ప్లాస్టిక్ పైపును భూమిపై ఊత కర్రవలే ఉపయోగించి శబ్దం చేయడం, పేడను చేతితో పిడకలు తయారు చేయకుండా ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించి చేసే నమూనాలను తయారు చేశాడు. పర్యావరణ అనుకూల పదార్థాలకు సంబంధించి ఈ విద్యార్థి తయారు చేసిన నమూనాలకు ప్రథమ బహుమతి లభించింది. అగళి ఎపిఎంస్ 9వ తరగతి విద్యార్థి విశ్వనాథ్ పొలాలలో కోతుల బెడద లేకుండా శబ్దం చేసే పరికరాన్ని తయారు చేశాడు. ఆరోగ్యం పరిశుభ్రత విభాగంలో ధర్మవరం బిఎస్ఆర్ బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని ఎస్.ఉమీర ప్రథమ బహుమతి, నాగసముద్రం పదవ తరగతి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి లక్ష్మీనరసింహ ద్వితీయ బహుమతికి ఎంపిక అయ్యారు. సాఫ్ట్‌వేర్, యాప్ విభాగంలో ధర్మవరం బిఎస్ఆర్ బాలుర మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి జి.నారాయణ డే టు డే యాప్‌ను తయారు చేసినందుకుగాను ప్రథమ బహుమతి లభించింది. పరిగి మండలం ధనపురం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి ఎల్.మంజుల స్మార్ట్ పార్కింగ్ సర్వీస్ సిస్టం తయారు చేసినందుకు ద్వితీయ బహుమతికి ఎంపిక అయ్యింది. గణిత నమూనాకు సంబంధించి తనకల్లు ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వి.తులసి ప్రథమ బహుమతి, చిలమత్తూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి వి.ధనుంజయ ద్వితీయ బహుమతి సాధించాడు. పర్యావరణం, వాతావరణ మార్పులకు సంబంధించి రామగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి బి.వెంకటేష్, ప్రథమ బహుమతి, కొత్తచెరువు జెడ్పీ పాఠశాల విద్యార్థి కె.జాహ్నవి ద్వితీయ బహుమతి సాధించారు. ఇలా దాదాపు 120 ప్రదర్శనలను విద్యార్థులు తయారు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అందరికీ కలెక్టర్ బసంత్‌కుమార్ బహుమతులను అందజేశారు.

రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు

జీఆర్పీఎఫ్ సీఐ బోయ కుమార్

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వే పరిధిలోని రైల్వే ఆస్తులపై దాడి చేసి నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వే జీఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక రైల్వే జీఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వే అధికారుల ఆదేశాల మేరకు రైల్వే ఆస్తులపై ఎలాంటి దాడులు చేసినా, రైల్వే చట్టం ప్రకారం కఠిన చర్యలతోపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఇటీవలే ప్రారంభించిన వందేభారత్ రైలుపై దాడులు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ట్రాకులపై రాళ్లు, కట్టెలు ఉంచుట, రాళ్లతో దాడులు చేయుట వంటివి చట్టవిరుద్ధమన్నారు. వీటివల్ల ప్రయాణికులకు కూడా తీవ్రగాయాలయ్యే అవకాశం ఉందన్నారు. రైల్వేస్టేషన్, రైళ్లో తప్పిపోతే నూతనంగా ఏర్పాటు చేసిన భారతీయ వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్ఐఆర్ కన్నా ముందు తప్పిపోయిన వారి ప్రాథమిక సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కర్నూలు జిల్లా డోన్‌లో న్యాయవాది దామోదర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌చౌదరి, ఉపాధ్యక్షులు సుబ్బారావులు డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం ధర్మవరం కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దస్తగిరిసాబ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ముదిగుబ్బ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ 41వ సీనియర్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎల్బిజిత్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రోషిణి, హసీనా, తీర్థ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టు తరపున ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జిల్లా షటింగ్ బాల్ అసోసియేషన్ ఇన్‌ఛార్జి సెక్రటరీ పూల ప్రసాద్ తెలిపినట్లు తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను సన్మానించారు ఈ కార్యక్రమంలో పిడి రేఖ, తదితరులు పాల్గొన్నారు.

పంటనమోదు పరిశీలన

గాండ్లపెంట : మండల పరిధిలోని కమతంపల్లి. చామాలగొంది పంచాయతీలలో సాగు చేసిన వేరుశనగ పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవి. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రబీలో బోరు బావుల సాగు చేసిన వేరుశనగ పంటలను ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మీ ప్రియ, ఎఇఒ సింధు, సర్పంచి నాగభూషణం రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న చేనేత విభాగం నాయకులు

చేనేతలతో వైసిపి చెలగాటం : టిడిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేతల జీవితాలతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని టిడిపి చేనేత విభాగం నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో చేనేతల సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు అనేక పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. ఒక్క ధర్మవరం పట్టణంలోనే 13,650 మంది చేనేత కార్మికులకు ముడిపట్టుపై సబ్సిడీ అందించామని గుర్తు చేశారు. వైసిపి వచ్చిన తర్వాత ముడిపట్టు సబ్సిడీని అటకెక్కించిందన్నారు. అంతేగాకుండా టిడిపి హయాంలో బీసీ కార్పొరేషన్ కింద ప్రతి చేనేత కార్మికునికీ రూ.1లక్ష సబ్సిడీ, బ్యాంకు రుణం రూ.1లక్ష ఇచ్చి ఆదుకుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చేనేత వర్గాలపై విధిస్తున్న జీఎస్టీని తక్షణమే రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి చేనేత విభాగం నాయకులు కాచర్ల కంచన్న, చారుగుండ్ల ఓబుళేశు, శీలామూర్తి, చట్టా లక్ష్మీనారాయణ, పుట్లూరు సంజీవులు, మంజు, బీరే శ్రీనివాసులు, కేతా శ్రీనివాసులు, చెలిమి శివరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ డిమాండ్ చేఆరు. ఈ మేరకు టిడిపి మహిళా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఎఒ నాగరాజుకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల వేతన బకాయిలు చెల్లించి, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం మహిళాధ్యక్షురాలు అనసూయమ్మ, అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, లీలావతి, పరిగి మండల మహిళా అధ్యక్షురాలు లలితమ్మ, నియోజకవర్గ కార్యదర్శి రత్నమ్మ, పరిగి మండల కార్యదర్శి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పోలీస్ పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పోలీసుఅధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త అత్తారింటి వేధింపులు, రస్తా వివాదాలు, ఉద్యోగ మోసాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు తదితర సమస్యలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, సిఐ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

ప్రజాశక్తి హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా చాలామంది రోడ్లను ఆక్రమించుకున్నారని వాటి తొలగింపునకు స్వచ్ఛందంగా సహకరిస్తే పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె వైస్ చైర్మన్ జబీవుల్లాతో కలిసి పట్టణంలో పలు ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. ధనలక్ష్మి రోడ్డును పరిశీలించి రోడ్డులో నిర్మాణం చేసిన ఆక్రమ కట్టడాలను తొలగింపు చర్యలను చేపట్టారు. అనంతరం దుర్గాబాయి దేశ్ ముఖ్ పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాగేంద్ర, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డులకు శిక్షణ

పుట్టపర్తి రూరల్ : జిల్లా కేంద్రంలోని హోంగార్డులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో హోమ్ గార్డ్ మొబిలైజేషన్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లు, పెంచుకోవాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సౌత్రన్ రీజన్ హోంగార్డు కమాండెంట్ ఎం మహేష్ కుమార్, జిల్లా ఎఆర్ డిఎస్పి విజయ్ కుమార్, హోంగార్డు ఆర్ ఐ శ్రీశైలం రెడ్డి , ఎఆర్ ఎస్ఐ శ్రీరాములు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సౌజన్యలక్ష్మి

ప్రజాశక్తి - పరిగి

పరిగి తహశీల్దార్ సౌజన్యలక్ష్మిని హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సౌజన్యలక్ష్మి హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

అనుమతి లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణం, మండల వ్యాప్తంగా అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం పట్టణంలోని సత్యనారాయణపేటలో గల యూరో కిడ్స్, నానెప్పనగర్ లోని సన్రైజర్స్ తదితర ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఎంఇఒ పరిశీలించారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వారికి నోటీసులను జారీ చేశారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ హిందూపురంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే డ్రెస్ కోడ్ ఉండాలని సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలి

నల్లచెరువు : ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని మాజీ ఎంపిపి మాబూసాబ్ పిలుపునిచ్చారు. స్థానిక గీతా మందిరంలో సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాబూసాబ్, మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలులో లేదన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. గ్రామస్థాయిలో వాలంటీర్ల బెదిరింపులకు, ప్రలోభాలకు, భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పార్టీని పటిష్టపరచాలని సూచించారు. ప్రతి కార్యకర్త తమకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ అమీర్, మండల అబ్జర్వర్ గంగిరెడ్డి, మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ కన్వీనర్ దాదెం శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోండి : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉత్సవాలపై సోమవారం రాత్రి అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా కాటకోటేశ్వరస్వామి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గతేడాది కాటి కోటేశ్వరస్వామి ఉత్సవాల్లో గొడవలు జరిగిన నేపథ్యంలో ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏఏ చర్యలు తీసుకోవాలో అన్న వాటిపై ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ, ముదిగుబ్బ, సీఐ, తాడిమర్రి ఎస్ఐ, ఆలయ కమిటీ ఛైర్మన్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా గతేడాది గొడవలకు కారణమైన వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్‌పీరా, ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు, తాడిమర్రి ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సాగుభూముల పట్టాల కోసం నిరసన

రొద్దంలో ఆందోళన చేస్తున్న సాగురైతులు

చిలమత్తూరులో నాయకుల, రైతుల ఆందోళన

పెనుకొండ : ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగుదారులందరికి అసైన్మెంట్ చేసి భూ పంపిణీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా నాయకులు నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు తిప్పన్న, నరసింహులు, క్రిష్టప్ప, రాజశేఖర్, రామాంజనమ్మ, తిప్పన్న, సాగుదారులు పాల్గొన్నారు.

రొద్దం : గత కొన్నిసంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి పాసుపుస్తకాలు మంజూరు చేయాలని సాగు రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం మండలంలోని కోగిర, కంబాలపల్లి, శాపురం గ్రామాలకు చెందిన భూములు లేని నిరుపేదలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అనంతచారికి సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోగిర కంబాలపల్లి, షాపురం గ్రామానికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీలు సర్వేనెంబర్ 666, 667, 668, 669లోనిదాదాపు 500 ఎకరాల భూమిని12 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని అన్నారు. అధికారులు ఈ భూములను పరిశీలించి అసైన్మెంట్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాముడు, నారాయణప్ప, ఆదినారాయణ, బాలకృష్ణ, గంగాధర్‌తో పాటు అధికసంఖ్యలో సాగురైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న నిరుపేద రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురం రైతులు డిప్యూటీ తహశీల్దార్ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురంలో 50 సంవత్సరాలుగా 377 సర్వే నెంబరు లో దాదాపు 50 మంది 135 ఎకరాల్లో, సర్వే నెంబరు 67 లో 8 మంది రైతులు సాగులో ఉన్నారన్నారు. వీరికి 8 వ విడత భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమేష్, సిపిఎం నాయకులు రామచంద్ర, నరసింహ, రైతులు మాబు, శ్రీనివాసులు, నంజుండ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని పలు గ్రామాలలో సాగు చేస్తున్న సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాగురైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాకాలంగా తుంగోడు, పందిపర్తి రెవెన్యూ గ్రామాలోని పొలాలలో పంటల సాగు చేస్తున్న నిరుపేద రైతులకు ఎనిమిదో విడత భూ పంపిణీలో పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ సిద్దేశ్వర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, కొండా వెంకటేశు, షీలా నారాయణస్వామి, సాగుదారులు నాగరాజు, అంజనమ్మ, మారెక్క, గుర్రప్ప, రాధా, వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న నిరుపేద రైతులకు పట్టాలు ఇవ్వాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పేదరైతులతో కలసి సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 'సోలార్ వద్దు వ్యవసాయం భూమి ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పేద రైతులకు భూమిని పంపిణీ చేయడంలో పాలకులు, అధికారులు నానా నిబంధనలు విధిస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, నాగరాజు, శివయ్య, శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయ్ : టిడిపి

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో వైసిపికి రోజులు దగ్గరపడ్డాయని టిడిపి నాయకులు మండిపడ్డారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న అన్నాక్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అన్నాక్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందని విమర్శించారు. అంతేకాకుండా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మందుషాపులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయన్నారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని అప్పుడు అన్నా క్యాంటిన్లను తిరిగి ప్రారంభించి పేదవారికి కడుపు నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోతంగౌడ్, మిడతల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

తమలపాకుల అలంకారంలో త్రిలింగేశ్వరస్వామి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తేరుబజారులో వెలసిన త్రిలింగేశ్వరస్వామి సోమవారం తమలపాకుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. మాఘమాసం సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారిని తలమపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ధర్మవరం యోగా నూతన కమిటీ ఎన్నిక

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పట్టణ యోగా అసోషియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా గాజుల సోమేశ్వరరెడ్డి, వైస్ ప్రసిడెంట్ ఆది, యోగా మాస్టర్‌గా తిరుమలేష్, జాయింట్ సెక్రటరీగా నరసింహులు, సబ్ జాయింట్ సెక్రటరీగా ఈశ్వరయ్య, కోశాధికారిగా కట్టా రవికుమార్, సభ్యులుగా వెంకటేశ్వర్, దాసరి రామన్న. సుబ్బయ్యశెట్టి, నాయుడు, నాగరాజు, దాసరి శీను, గుర్రం వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు.

సత్యసాయి ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న గోరుముద్ద పథకానికి అదనంగా సత్య సాయి ట్రస్టు పౌష్టిక ఆహారంగా రాగి మాల్ట్ అందించడానికి ముందుకు వచ్చినందుకు సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు పూలమాలతో పాటు శాలువాలు కప్పి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో క్రమబద్ధంగా పంపిణీ చేయడం ఒక సత్య సాయి ట్రస్ట్ కే సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మి, నెట్ క్యాబ్ డైరెక్టర్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి నాయకులు ఎస్.టి.డి నరసింహులు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి 'నారాయణ' విద్యార్థులు

కదిరి టౌన్ : కర్నాటక రాష్ట్రం చిక్బల్లాపూర్ జిల్లా గౌరీ బిదనూరులో ఆర్గనైజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ అక్బర్‌అలీ తెలిపారు .అమ్మాయిల వైట్ బెల్ట్ కటాస్ విభాగంలో మహాలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించారు గ్రీన్ బెల్ట్ అబ్బాయిల విభాగంలో రామ్ చరణ్ గోల్డ్ మెడల్ సాధించగా ఆరెంజ్ బెల్ట్ అబ్బాయిల విభాగంలో సన్నుత్ సిల్వర్ మెడల్ సాధించాడు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ సర్ఫ్ రాజ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రమేష్ బాబు, అకడమిక్ డీన్ విష్ణు, ఏవో జక్రియ, వైస్ ప్రిన్సిపల్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిఅడ్డంకులు సృష్టించినా 'యువగళం' ఆగదు : బికె

పెనుకొండ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ఎవరు ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు పెట్టిన ఆగదని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం 18వ రోజు యువగళం పాదయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా, నగరి నియోజకవర్గం, పుత్తూరు శ్రీవెంకటేశ్వర పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరిగ్ అండ్ టెక్నాలజీ (చిన రాజకుప్పం)లో పార్థసారథి లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. యువ గళం పాదయాత్రను అడ్డుకోవడానికి జగన్ ప్రభుత్వం మొదటి నుండి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్నిఅడ్డంకులు పెట్టినా 400 రోజులు, 4000 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి -పెనుకొండ

మండలంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు హరీష్ మాట్లాడుతూ మండలంలోని ఆడదాకులపల్లి, నాగులూరు, బండ్లపల్లి, గుడిపల్లి, సానపల్లి, నల్లూరు, గోనిపెంట, గొల్లపల్లి గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు తమ గ్రామాల నుండి పెనుకొండకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మనోజ్ కుమార్, పవన్ కుమార్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ప్రయోజనం

సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోరంట్ల : పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో సోమవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి వెళ్లగలరని తెలిపారు. ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యాభ్యాసాన్ని ప్రతి విద్యార్థి పూర్తి చేయాలన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలను అందుకోగలుగుతారన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరినప్పుడు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చిన వారవుతారన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, శంకర, బాలమోహన్, హరీష్, నందగోపాల్, లక్ష్మీ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం : రాష్ట్ర ప్రభుత్వం తీసుకుచ్చిన నూతన విద్యా విధానంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యముతోందనిఆదర్శ విద్యాసంస్థల అధినేత పెదరాసు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ3.4.5 తరగతులు చదువుతున్న ప్రైమరీ విద్యార్థులు హై స్కూల్ లో చదువుకోవాలని నూతన పాలసీ ప్రభుత్వం తీసుకురావడం వలన గ్రామీణ ప్రాంతాల్లో ప్రైమరీ విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైమరీ స్కూల్ విద్యార్థులు చిన్న పిల్లలు హైస్కూల్ కి వెళ్లడానికి సుమారు 2 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. నూతన విద్యా విధానం వలన ప్రైవేట్ కళాశాలలు నడపడం కష్టంగా ఉందన్నారు రాష్ట్రంలో వేలాది ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

గ్రామ సచివాలయాల్లో సర్వీసులు పెంచాలి

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి - చిలమత్తూరు

గ్రామ సచివాలయాలలో సర్వీసులను పెంచి తద్వారా ప్రజలకు సేవలందించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు చిలమత్తూరు మండలంలోని టేకులోడు, దేమకేతేపల్లి పంచాయతీలలోని గ్రామ సచివాలయాలను ఆయన సోమారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాలను పరిశీలించిన ఆయన రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల గౌర్హాజరు, ఎక్కువ రోజులు సెలవులు తీసుకోవడం వంటి వాటిని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది ఈ సర్వీసెస్,ఈ శ్రమ్,ఆయుష్మాన్ భారత్, రిజిస్ట్రేషన్‌పై ఆరా తీశారు. ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరితగితన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవాలని సచివాలయాలను మండల అభివృద్ధి అధికారి పర్యవేక్షణ చేస్తూ గాడిలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాంకుమార్,కార్యదర్శి నాగరాజు, డాక్టర్ రామకృష్ణ, మండల స్థాయిలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

స్వార్థ రాజకీయం కోసమే 'వివేకా' హత్య : టిడిపి

ప్రజాశక్తి కదిరి అర్బన్

వైఎస్ వివేకానందరెడ్డి హత్య రాజకీయ దురుద్దేశ్యంతోనే జరిగిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాలు చేసిన విలేకరుల సమావేశంలో కందికుంట మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వివేకానంద రెడ్డి హత్య జరిగిందన్నారు. దీంతో టిడిపిపై జగన్మోహన్‌రెడ్డి లేనిపోని నిందలు వేశారన్నారు. ప్రజల్లో సానుభూతి సంపాదించుకోవటానికి ఈ కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో భవిష్యత్తులో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులను సిబిఐ అధికారులు విచారణకు పిలిపిస్తారని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా ప్రజల పక్షాన నిలబడి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి పాటుపడాలని సూచించారు. వివేకానంద రెడ్డి హత్య విధానాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా రచించిన జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఈసందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగేంద్ర, రాజశేఖర్ బాబు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న 'కందికుంట', తదితరులు

పేదలకు అండగా ఉంటాం: టిడిపి

పెనుకొండ : పేదలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని, పేదవాడి ఆకలి తీర్చడమే తెలుగుదేశం పార్టీ ముఖ్య ఉద్దేశం అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటిన్ ను ఏర్పాటు చేసి రెండవ రోజు పేదలకు 5 రూపాయలకే రుచికర మైన భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు మీద వ్యక్తిగత కక్షతో అన్నా క్యాంటీన్లను పూర్తిగా మూసివేశారని విమర్శించారు.రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాలలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మాజీ జెడ్పీటీసీ వెంకట రమణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు డీవీ అంజినేయుల, రొద్దం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు అంజినేయులు, త్రివేంద్ర నాయుడు, నంజప్ప, బాబుల్ రెడ్డి వాసుదేవరెడ్డి చిన్నపోతన్న కొనాపురం ప్రసాద్ అంజినాయక్ , వీరచిన్న, చంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న సవితమ్మ, తదితరులు

మహారాజశ్రీ గౌ॥ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.738/2019

Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main Branch వారు rep by its Chief Manager, Kadiri ...Plaintiff
మరియు
జూటూరు శ్రీదేవి మరియు ఇతరులు ...Defendants
D1) జూటూరు శ్రీదేవి S/o జూటూరు ప్రసాద్ R/at డోర్‌నెం.12-239-1, అంబేద్కర్‌నగర్, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.

పై దావాలోని D1 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main branch వారు) ప్రతివాది డి1 అయినా మీ పైన మరియు ఇతరులు పై బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసియున్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 30-03-2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు 30-03-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకి స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:30-03-2023.

జి.గురులింగస్వామి, బి.ఏ., బి.ఎల్., వాదితరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ గౌ॥ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.146/2021

Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main Branch వారు rep by its Chief Manager, Kadiri ...Plaintiff
మరియు
కె.చంద్ర ఆచారి మరియు ఇతరులు ...Defendants
D1) కె.చంద్ర ఆచారి S/o వెంకటరామ ఆచారి R/at డోర్‌నెం.3-94, రత్నాలపల్లి, నల్లచెరువు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.

పై దావాలోని D1 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main branch వారు) ప్రతివాది డి1 అయినా మీ పైన మరియు ఇతరులు పై బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసియున్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 01-03-2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు 01-03-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకి స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:01-03-2023.

జి.గురులింగస్వామి, బి.ఏ., బి.ఎల్., వాదితరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ గౌ॥ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.174/2021

Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main Branch వారు rep by its Chief Manager, Kadiri ...Plaintiff
మరియు
D1) జి.లక్ష్మిపతిరెడ్డి S/o రెడ్డప్పరెడ్డి R/at రత్నాలపల్లి, నల్లచెరువు మండలము.
D2) డి.ఉత్తప్ప S/o పెద్ద అంజినప్ప R/at శివరాంపురం, నల్లచెరువు మండలము. ...Defendants

పై దావాలోని D1 మరియు D2 ప్రతివాదులకి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కదిరి Main branch వారు) ప్రతివాదులకి డి1 మరియు డి2 అయినా మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసియున్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 03-03-2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు 03-03-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకి స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:03-03-2023.

జి.గురులింగస్వామి, బి.ఏ., బి.ఎల్., వాదితరుపు వకీలు, కదిరి.

ప్రకటన

మా కక్షిదారుడైన P.శేషప్ప S/o P.ఆదినారాయణ శాస్త్రి R/o పెనుకొండ అయిన వీరు పెనుకొండ వజ్రాలపేటలో ఉన్న Plot No.17 (AC 0.03.4 cents) in S.NO.445-1 గల కాలి జాగాను M.వెంకటరాముడు R/0 గుట్టూరు వారి నుండి కొను గోలు చేసి రిజిష్టర్ విక్రయం పొందినారు. సదరు విక్రయ పత్రంనకు లింక్ విక్రయపత్రం అనగా సదరు M.వెంకటరాముడు, G.శ్రీనివాసులు నుండి కొనుగోలు చేసిన రిజిష్టర్డ్ విక్రయ పత్రం DOC NO.2851/2003 dt:18-2-2003 (లింక్ పత్రం) ను ఈదినం 13/2/2023 కోర్టు ముందర ఉన్న Xerox center నందు Xeroy చేసినపుడు పోగొట్టు కున్నాను. సదరు లింక్ విక్రయ పత్రం ఎవరికైన దొరికిన ఎడల మా కక్షిదారుని **Cell No:9440699367.** తెలియజేయవలసినదిగా కోరడం అయినది.

D.శ్రీనివాస్, BCom., LLB
న్యాయవాది, పెనుకొండ - 515110.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL:(Hon'ble District Judge) ANANTHAPURAMU
M.V.O.P. No:211/2022

Between:
Pittla Chinna Masthan ...Petitioner
And
1.Anike Adi Shesu Reddy
2.Bharathi AXA General Insurance Company Ltd., represented by its Authorized Signatory Vijayawada. ...Respondents

NOTICE TO RESPONDENT NO:1

To
Anike Adi Sheshu Reddy son of A.Krishna Reddy, aged 30 years, Hindu, R/o Damanupalli Village, Mudigubba Mandal, Sri Satya Sai Districrt. (Owner cum-Driver of the Car No:KA-51 MN-5501)

పై నెంబరు దావాలోని మొదటి ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టువారు 24-02-2023 వ తేదిన వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

"కోర్టువారి ఉత్తర్వుల మేరకు"

K.Narasimha Reddy
Advocate for the Petitioner
Ananthapuramu, Cell:9440984261.

రైలు ఢీకొని చేనేత కార్మికుడు మృతి

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పామాల నారాయణస్వామి (47)ని సోమవారం రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాల మేరకు... కేతిరెడ్డికాలనీకి చెందిన పామాల నారాయణస్వామి కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం బహిర్భుమికి వెళ్లి రైలుపట్టాలు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. దీంతో నారాయణస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం శవాన్ని పోస్టుమార్గం నిమిత్తం ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. మృతునికి చెవులు సరిగా వినకపోవడంతో రైలు రావడాన్ని గమనించని కారణంగా ఢీకొని మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య లక్ష్మీదేవితోపాటు ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

రొద్దం. : మండలంలోని శేషాపురం గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఐదుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.14,690ల నగదు, 2 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మారుతీ, మహేష్, హనుమంత రాయిడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బత్తలపల్లి : కుక్క అడ్డురావడంతో తప్పించబోయి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు అంగజాల ఆదెప్ప, అంగజాల జయరాముడు(37) కలిసి వ్యక్తిగత పనులపై శనివారం ద్విచక్రవాహనంలో అనంతపురానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మండలంలోని రాఘవంపల్లి క్రాస్ వద్దకు రాగానే కుక్క అడ్డు వచ్చింది. దీంతో కింద పడి ఆదెప్పకు స్వల్ప గాయాలు, జయరాముడుకు తలకు, కాళ్లకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే క్షతగాత్రులను అనంతపురం తీసుకువెళ్లారు. అక్కడ నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జయరాముడు ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య శివమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లారీలో మంటలు.. తప్పిన ప్రమాదం

ధర్మవరం టౌన్ : నార్పల నుంచి బాగేపల్లికి ఆదివారం అర్ధరాత్రి వరిపొట్టు వేసుకుని వెళ్తున్న ఓ లారీ ధర్మవరంలోని ఎన్ఎస్‌బార్ వద్దకు రాగానే ఉన్నఫలంగా కింది భాగంలో మంటలు వ్యాపించాయి. ఇంతలోనే అటువైపు వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి గస్తీకి వెళ్తుండగా ఘటనను గమనించి స్థానికుల సాయంతో మంటలను నీటితో ఆర్పే ప్రయత్నం చేశారు. అయిన మంటలు తగ్గకపోవడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పిందని సీఐ తెలిపారు.

కర్నాటక మద్యం, బియ్యం స్వాధీనం

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం వార్డుకు చెందిన రబ్బానీ, వెంకటేష్‌ను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 10 కేసుల కర్నాటక మద్యాన్ని సోమవారం సీజ్ చేసినట్లు పెనుకొండ ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. అదేవిధంగా పెనుకొండ వై జంక్షన్ నందు మహేంద్ర గూడ్స్ వాహనాన్ని సీజ్ చేసి అందులోని 30 పాకెట్ల బియాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి ప్రభావతి, ఆర్ఐ పురుషోత్తం, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పుట్టపర్తి రూరల్: మండలంలోని గాజులపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పస్థితిలో మృతిచెందాడు. 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి మతదేహం గ్రామంలోని రచ్చకట్ట సమీపంలో పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సిఐ జయ నాయక్ మృతుడు ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి మతదేహాన్ని ఇక్కడ పడేసి వెళ్లారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతుని కుడిచేయి మణికట్టుపై ఓం గుర్తు ఉంది. మృతుని వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ సూచించారు.

గ్రామాల్లో నాకాబందీ

మడకశిర రూరల్ : మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో సోమవారం ఉదయం సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, బాల్య వివాహాలు, కర్నాటక మద్యం తదితర వాటి గురించి ఆరా తీశారు.

నకిలీ పట్టాలు సృష్టించిన నిందితులపై కేసు నమోదు

గోరంట్ల : పట్టణంలో తాశీల్దార్ కార్యాలయం సమీపాన సర్వేనెంబర్ 271/2.3లో నకిలీ పట్టాలు సృష్టించిన 16 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ రంగనాయకులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శ్రీశైలానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పుట్టపర్తి అర్బన్ : శివరాత్రి పర్వదినం సందర్భంగా సత్యసాయి జిల్లా నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టిసి జిల్లా ప్రధాన అధికారి మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఈనెల 15 నుంచి నడపబడుతాయన్నారు. భక్తులు సమీప బుకింగ్ కేంద్రాలను సంప్రదించాలని లేదా ఆయా బస్టాండ్లో ఆన్లైన్ ద్వారా ముందుగా టికెట్లు పొందవచ్చని చెప్పారు. ఈ సౌకర్యాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక ప్రార్థనల్లో మైనార్టీ యువకులు

పెనుకొండ : టర్కీ ,సిరియా దేశంలో గత వారం రాత్రి జరిగిన భూకంపం లో ఎన్నో కోట్ల నష్టం ,ప్రాణ నష్టం ఎన్నో వేలాది మంది చనిపోయిన వారి ఆత్మ శాంతి చేకూరలని కోరుతూ సోమవారం రాత్రి పట్టణంలో దర్గా పేటలో బాబయ్యస్వామి దర్గా ముందు మైనారిటీ యువకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యువకులు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలలో అందుబాటులోకి శుద్ధజలం

హిందూపురం : మండల పరిధిలోని సీ.చెర్లోపల్లిలో గల ఏపీ ఆదర్శ పాఠశాలలో ఎమ్మెల్సీ ఇక్బాల్ కృషితో శుద్ధజలం అందుబాటులోకి వచ్చింది. ఆదర్శ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను సోమవారం పున్నప్రారంభించారు. గత కొన్ని నెలలుగా పాఠశాలలో ఆరో ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో విషయాన్ని పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్సీ తన సొంత ఖర్చులతో రూ.35వేలును వెచ్చించి ఆర్వో ప్లాంట్ ను మరమ్మతులు చేయించారు. దీంతో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి, వైసిపీ నాయకులు అశ్వర్థరెడ్డి ఆర్వో ప్లాంట్‌ను పున్నప్రారంభించారు.

రుణాల ద్వారా జీవనోపాధి పొందాలి

కదిరి టౌన్ : స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు రుణాల ద్వారా జీవనోపాధి పొందాలని ఎపిడి నరసయ్య, ఎపిఎం శారద పేర్కొన్నారు. సోమవారం కదిరి రూరల్ మండలం, బత్తలపల్లి గ్రామంలో రూ. 15లక్షలు పైబడి బ్యాంకు నుండి రుణాలు తీసుకున్న మూడు సంఘాల సభ్యులు ప్రస్తుతం కుటుంబ జీవనోపాధి ద్వారా ఆదాయం పొందుతున్న వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎపిఎంలు సిసిలు, యానిమేటర్లు, బుక్ కీపర్లు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన క్రికెట్ టోర్నీ

లేపాక్షి : మండలంలోని గౌరిగానిపల్లిలో సర్పంచి నిర్మలమ్మ, వేణుగోపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజులగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని సోమవారం ముగిసింది. ఫైనల్ పోటీలో గౌరిగానిపల్లి, జగరెడ్డి పల్లి జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో విజేతగా నిలచిన గౌరిగానిపల్లి జట్టుకు రూ.12 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జగరెడ్డిపల్లి జట్టుకు రూ. 7వేల నగదు బహుమతిని అందజేఆరు. ఈకార్యక్రమంలో నాయకులు శంకరప్ప, రఘునాథ్ రెడ్డి, వెంకటచలపతి, అశ్వర్థప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.